
మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రజలకు అనుగుణంగా చేపట్టాలి

వనస్థలిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రజలకు అనుగుణంగా చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి మాదాపూర్ హైటెక్స్‌లోని ఆర్‌అండ్‌బీ బిల్డింగ్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ వనస్థలిపురం పనామా వద్ద అండర్‌పాస్ పనులు చేపట్టడంతో కాలనీలకు కనెక్టివిటీ రోడ్లు మూసుకపోయే ప్రమాదం ఉందన్నారు. అండర్‌పాస్ కాకుండా పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ పనులు చేపడితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉండే వ్యాపార సముదాయాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని మంత్రి దృష్టికి తీసుక వచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి విస్తరణ పనులు చేపట్టే విధంగా ప్రణాళికలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారని వారు పేర్కొన్నారు.

మార్నింగ్‌వాక్‌లో సమస్యల పరిశీలన


మార్నింగ్‌వాక్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, ఉపకమిషనర్ సుజాత

ఎల్‌బీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మార్నింగ్‌వాక్‌లో సమస్యలు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీలో సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాతతో కలిసి ఆకుల శ్రీవాణిఅంజన్ శుక్రవారం మార్నింగ్‌వాక్ చేశారు. ఈ సందర్భంగా స్థానికలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ(శానిటేషన్) నీలిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏ నరేష్, రాంకీ సూపర్‌వైజర్ భరత్, పూజ, జలమండలి సూపర్‌వైజర్ శంకర్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాయుకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయకాలనీని ఆదర్శంగా తీసుకోవాలి


చెత్త రిక్షాను కార్మికులకు అందజేసి వారిని సన్మానిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కాకతీయకాలనీని ఆదర్శంగా తీసుకుని అన్ని కాలనీల సంక్షేమ సంఘాలు, కాలనీవాసులు పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. కాకతీయకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో చెత్త తొలగించేందుకు కొత్త చెత్తరిక్షాను శుక్రవారం అందజేశారు. ఆ రిక్షాను రాజశేఖర్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు అందజేసి సన్మానించారు. నిత్యం కాలనీలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చెత్తను తొలగించాలని సూచించారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణకు కార్మికులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకతీయకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు అమీదుద్దీన్, యాదగిరి పాల్గొన్నారు.

ఆర్టీసీ మనుగడ ఉద్యోగుల చేతిలోనే: సుచరిత

హయత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మనుగడ ఉద్యోగుల చేతిలో ఉందని హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సుచరిత అన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు, ఉన్నత విద్యలో రాణిస్తున్న ఉద్యోగుల పిల్లలకు శుక్రవారం హయత్‌నగర్-1 డిపోలో వ్యాస రచన, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్ దొంగలను పోలీసులకు అప్పగించిన ఉద్యోగులు చక్రపాణి, జయశ్రీలను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్ విజయకుమారి, శ్యాంసుందర్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హయత్‌నగర్ డిపో పరిధిలోని ప్రయాణికులు తమ విలువైన సూచనలు, సలహాలను 9959226419కు తెలియజేయాలని కోరారు.

ఉత్తమ డ్రైవర్, కండక్టర్లకు అవార్డుల పంపిణీ


అవార్డులతో డ్రైవర్లు, కండక్టర్లను అభినందిస్తున్న రీజినల్ మేనేజర్ శ్రీలత, డీఎం కృష్ణమూర్తి

చాదర్‌ఘాట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ హైదరాబాద్-2 డిపోలో ఏప్రిల్, మే మాసాల్లో అధిక ఆదాయం తీసుకువచ్చి ప్రతిభ కనబరచిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లకు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత అవార్డులను ప్రదానం చేశారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే మాసంలో లక్ష్యే లక్ష్యంగా విధులు నిర్వహించి హైదరాబాద్-2 డిపో ఆదాయం పెంచడంలో ప్రతిభను కనబరచడంతోపాటు డిపోకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్-2 డిపోలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రశంసించారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగుల పిల్లలు శ్రీనిధి, హ్యాప్పీలకు కూడా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కృష్ణమూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఉషశ్రీ, అసిస్టెంట్ మెకానికల్ రవిశంకర్, స్టోర్ సూపర్‌వైజర్ ఉమాపతి పాల్గొన్నారు.

నాదర్‌గుల్ రహదారిని అభివృద్ధి చేయండి


కమిషనర్ రఘుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ జడ్పీ హైస్కూల్ వరకు గల ప్రధాన రహదారి విస్తరణ పనులను అర్ధాంతరంగా ఆపేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సదరు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ ఫ్లోర్ లీడర్, నాదర్‌గుల్ 27వ డివిజన్ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి మునిసిపల్ కమిషనర్ రఘుకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన బీజేపీ బడంగ్‌పేట్‌శాఖ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్


శ్రీనివాస్‌గౌడ్‌కు నియామక పత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

హయత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా హయత్‌నగర్‌కు చెందిన తిరుమల శ్రీనివాస్ గౌడ్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పెళ్లికూతుళ్లకు తులం బంగారం ఏదీ..?

- ఆరు నెలలైనా అమలు కాని కాంగ్రెస్ హామీ
- మాజీ మంత్రి సబితారెడ్డి విమర్శ


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్

సరూర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడిచినా ఎన్నికలకు ముందు ఆ పార్టీ ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు కావడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని అప్పట్లో ఆ పార్టీ ప్రకటించిందని, ఇప్పటికీ ఆ హామీ అమలు కాలేదని ఆమె అన్నారు. ఆ లెక్కన కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చెక్కులు అందుకున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం తులం చొప్పున బంగారం బాకీ ఉన్నట్టేనని సబితారెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో బాలాపూర్ తహసీల్దార్ కె.మాధవీరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం తాను మంజూరు చేయించిన దాదాపు రూ.280 కోట్ల నిధులను ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, ప్రజల కోసం ఖర్చు పెట్టే నిధులను సైతం అడ్డుకోవడం అనైతిక చర్య అని విమర్శించారు. ప్రభుత్వానికి నిజంగా అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కమిషనర్ జి.రఘు, బాలాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, బడంగ్‌పేట్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్గంటి అర్జున్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ యాతం పవన్ యాదవ్, బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భీమిడి స్వప్నాజంగారెడ్డి, సుక్క శివకుమార్, జెనిగె భారతమ్మాకొమురయ్యయాదవ్, ఏనుగు రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు రఘునందన్ చారి, ఖలీల్‌పాషా, బీఆర్ఎస్ బడంగ్‌పేట్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకటరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి ఎల్వోసీ అందజేత

బాలాపూర్‌కు చెందిన చంద్రకళ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరడంతో, వైద్య ఖర్చుల నిమిత్తం ఎక్కువమొత్తంలో డబ్బు అవసరం కావడంతో ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆశ్రయించగా, సీఎం సహాయనిధి నుంచి రూ.1.5లక్షలు మంజూరు చేయించి, దానికి సంబంధించిన ఎల్వోసీని శుక్రవారం చంద్రకళకు అందజేశారు.

విగ్రహాల ముసుగు తొలగేనా..?

- ఉద్యోగ సంఘాలతో మేయర్ చర్చలు


ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తోన్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో విగ్రహాల ముసుగు తొలగించే దిశగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంస్థలోని ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేసేందుకు వచ్చిన వారితో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట అభిప్రాయం చెప్పాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అప్పటి స్టాండింగ్ కమిటీలో నిర్ణయించారు. విగ్రహాన్ని తయారు చేయించి మేయర్ కార్యాలయం గేటు వైపు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగకముందే.. నాడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పోటీగా మహాత్మ గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తీసుకువచ్చి వైఎస్ విగ్రహం పక్కన పెట్టారు. ఇది వివాదాస్పదం కావడంతో మూడు విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచారు. దాదాపు దశాబ్దంన్నర కాలంగా విగ్రహాల ముసుగులు అలానే ఉన్నాయి. సున్నిత అంశం కావడం.. కేసు కోర్టు విచారణలో ఉండడంతో వాటిని ఎవరూ ముట్టుకోలేదు. ముసుగులతో విగ్రహాలు ఉండడం ఇబ్బందికరంగా ఉందని భావించిన మేయర్ ముసుగుల తొలగింపునకు ఉపక్రమించారు. ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. కార్యాలయ ప్రాంగణంలోని మరోచోట విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయం తీసుకున్నారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చాలని కొందరు చెప్పగా.. ఇంకొందరు మూడు విగ్రహాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏకగ్రీవ నిర్ణయంతో రావాలని.. మరోసారి సమావేశం నిర్వహించనున్నట్టు విజయలక్ష్మి తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ సంఘాల ఆందోళన


శ్రీచైతన్య పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

చంపాపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఓ కార్పోరేట్ పాఠశాల ఎదుట శుక్రవారం బీసీ విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా, నిరసన తెలిపి ఆందోళన వ్యక్తం చేశారు. హస్తినాపురం డివిజన్ జడ్జీరోడ్‌లోని దేవకమ్మతోట సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలలో స్టేట్ సెలబస్‌కు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉందని వారు పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం మాత్రం సీబీఎస్ఈ బోధన ఉంటుందని విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటున్నారు. తీరా చూస్తే సీబీఎస్ఈ బోధనకు బోర్డు నుంచి ఎటువంటి అనుమతులు లేవని తెలియడంతో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కుర్మా ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాలలో సుమారు 4వందలకు పైగా అడ్మిషన్లు జరిగినట్లు, సీఈబీఎస్ఈ పేరుతో అధికంగా ఫీజులు వసూళ్లు చేసినట్లు వారు తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల నేతలు పాఠశాల ఎదుట బైఠాయించారు. సీబీఎస్ఈ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేశారని, ఫీజుల దోపిడీని అరికట్టాలని, పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, ఎంఈవోకు వినతిపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై సరూర్‌నగర్ మండల విద్యాధికారి కృష్ణయ్యను వివరణ కోరగా శ్రీచైతన్య పాఠశాలకు 1నుంచి 8వరకు స్టేట్ బోర్డు అనుమతి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమం లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పానగంటి విజయ్‌కుమార్, గూడూరు భాస్కర్, వరికుప్పల మధు, భరత్‌గౌడ్, నాగేష్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, వెంకటేశ్, సాయికుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో బాక్స్‌డ్రెయిన్‌లో పూడికతీతకు చర్యలు


సాయినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని సాయినగర్‌కాలనీలో వర్షంతో వరద ముంపు సమస్య పరిష్కారానికి బాక్స్‌డ్రెయిన్‌లో పూడికతీతకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ, జలమండలి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. సాయినగర్ కాలనీలో వర్షం కురిసినప్పుడల్లా లోతట్టు కాలనీ కావడంతో వరద నీరంతా కాలనీ రోడ్లను ముంచెత్తుతుందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా సాయినగర్‌కాలనీ పక్క నుంచి నిర్మితమైన బాక్స్‌డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయి వరద నీరు పోయేందుకు వీలు లేకుండా పోతుందని, తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని ఆయన జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వరద నీరు బాక్స్ డ్రెయిన్‌లోకి వెళ్లేలా ఏర్పాటు చేసిన చోట తక్షణమే చెత్త అందులోకి వెళ్లకుండా మెష్ ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. స్థానికులు ఇక్కడ చెత్త పారవేయకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల మూసారాంబాగ్ బస్తీలో బాక్స్ డ్రెయిన్ పైకప్పు పునర్ నిర్మాణ పనులు పూర్తయినందున దాన్ని ఆనుకుని ఉన్న రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.9లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

మోదీ.. మద్దతు ధరలపై చట్టం చెయ్..!

- రైతులకిచ్చిన హామీని ప్రధాని నిలబెట్టుకోవాలి
- లేదంటే పోరాటం ఉధృతం: సంయుక్త కిసాన్ మోర్చా


రైతులపై ప్రయోగించిన తుపాకి తూటాలను, బాష్పవాయు గోళి, రాకెట్ బాంబులను చూపిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

పంజాగుట్ట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలను ఉపసంహరించుకునే సమయంలో రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రచారం చేస్తామని హెచ్చరించింది. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రైతుల మద్దతు కూడగట్టేందుకు సంయుక్త కిసాన్ మోర్చా చేపట్టిన యాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంఏర్పాటు చేశారు. మోర్చా జాతీయ కన్వీనర్ జగ్జీత్‌సింగ్ దల్లెవాలా, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు, దక్షిణ భారత రాష్ట్రాల సమన్వయకర్త కె.శాంతకుమార్, రైతు నాయకుడు పి.చెంగల్‌రెడ్డి, వివిధ రాష్ట్రాల నాయకులు మాట్లాడారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలతో పాటు ఎన్డీఏలోని బీజేపీయేతర ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. రైతుల సమస్యలపై ప్రైవేటు బిల్లు పెట్టాలని కోరుతామని చెప్పారు. కనీస మద్దతు ధరపై చట్టం కోసం ఫిబ్రవరి 13 నుంచి 4 చోట్ల నిరసనలు చేస్తున్నామని, 125 రోజులకు పైగా వేలాది మంది రైతులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామని, వర్షాకాల పార్లమెంటు సమావేశాలకు ముందు ఢిల్లీలో రెండు భారీ సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతించారు. సాగు చట్టాలపై నిరసనల సందర్భంగా రైతులపై ప్రయోగించిన తూటాలు, బాష్పవాయు గోళాలను సమావేశంలో ప్రదర్శించారు. అభిమన్యు కోహర్, లక్వీందర్‌సింగ్ (హరియాణ), పీఆర్ పాండ్యన్ (తమిళనాడు), సూర్జిత్‌సింగ్ (యూపీ), జాఫర్‌ఖాన్, సుఖ్‌జీత్‌సింగ్ (ఢిల్లీ), గోవిందరెడ్డి (కర్ణాటక) తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌కు పూర్వవిద్యార్థుల వితరణ

ఎల్‌బీనగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పురోభివృద్ధికి పూర్వవిద్యార్థుల తోడ్పాటు ఎంతో అవసరమని సరూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ 1980 బ్యాచ్ పూర్వవిద్యార్థులు పాఠశాలకు ఇండోర్ ఆడియో సిస్టమ్, క్రీడా పరికరాలు, మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. పూర్వవిద్యార్థులు ఆరోగ్యరాణి, వి.రఘునాథ్‌శర్మలు ఇండోర్ ఆడియో సిస్టమ్‌ను అందజేశారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 15మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు బహూకరించారు. క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. పీఈటీ రాఘవరెడ్డి, 1980బ్యాచ్ పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు మంద రాంచంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, రఘునాథ్‌శర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆరోగ్యరాణి, మల్లికార్జున్‌రావు, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, రమాదేవి పాల్గొన్నారు.

స్నేహితుడి అంత్యక్రియలకు వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల

- తాళాలు పగులగొట్టి 30తులాల బంగారు ఆభరణాలు అపహరణ


దొంగలు చిందర వందరగా పడేసిన వస్తువులు

హయత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్న దొంగలు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఒక ఇంట్లో ఏమి లభించక పోవడంతో మరో ఇంట్లో 30 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్‌లోని ప్రియదర్శినికాలనీ ఫేజ్-1లో పసుపులేటి స్వాతి నివాసం ఉంటారు. భర్త రాజు వారం రోజుల క్రితం దుబాయ్ వెళ్లాడు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి రామన్నగూడలో స్నేహితుడు చనిపోయాడని స్వాతి, పిల్లలు, తమ్ముడితో కలిసి ఇంటికి తాళం వేసి అంత్యక్రియల కోసం గురువారం ఉదయం 11గంటలకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో ఉండాల్సిన 30తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. దొంగలు పడ్డారని గ్రహించిన స్వాతి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డికి చెప్పగా ఆయన హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. అంతకు ముందే దొంగలు అలకుంట్ల సందీప్ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి విలువైన వస్తువుల కోసం ఇల్లంత సోదించారు. ఇంట్లో ఏమి లభించకపోవడంతో పక్కనే ఉన్న స్వాతి ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. బీరువాను పగులగొట్టి 30తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులను దోచుకుని దొంగలు స్వాతి ఇంటి వెనుక నుంచి పారిపోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వేలిముద్ర నిపుణులను పిలిపించి వేలి ముద్రలను సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు: చైర్‌పర్సన్ స్వప్న


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వప్న

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి అధ్యక్షతన తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా 46 ఎజెండా అంశాలపైన కౌన్సిల్‌లో చర్చించారు. అనంతరం 44 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలుపగా ఒకటి రిజక్ట్, మరొకటి వాయిదా వేశారు. వర్షాకాలం నేపథ్యంలో విపత్తు నిర్వహణ కోసం రూ. 20లక్షల ప్రత్యేక నిధులను కేటాయించారు. శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ పట్ల అధికారుల తీరుపై కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శానిటేషన్, వీధి దీపాల నిర్వహణపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలని సూచించారు. వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్, డీఈ శివానందంతో పాటు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీకి బస్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీ వరకు జూలై 1వ తేదీ నుంచి బస్సును ప్రారంభించనట్లు ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాణిగంజ్ డిపో నుంచి రూట్ నెంబర్ 90/253టి నెంబర్‌తో బస్ సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సులు సికింద్రాబాద్, తార్నాక, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, నాగోల్ మెట్రో స్టేషన్, సాగర్ క్రాస్‌రోడ్స్, చంపాపేట క్రాస్‌రోడ్స్, బార్కస్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, ఇమాంగూడ మీదుగా ఫ్యాబ్‌సిటీకి చేరుకుంటాయని తెలిపారు. ఫ్యాబ్‌సిటీలో పనిచేస్తున్న వారి సౌకర్యార్థం ఈ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.


అర్చరీ శిక్షణను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ

జువెనైల్ హోంలను సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

సైదాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రత్యేక బాలుర గృహం(జువెనైల్ హోమ్‌లు)లను శుక్రవారం రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరక్టర్ కాంతి వెస్లీ సందర్శించారు. ప్రత్యేక గృహంలో వివిధ కేసుల విచారణలో ఉన్న బాలలు, బాలుర గృహంలో ఉన్న వీధి బాలలు, బాల కార్మికులు, అనాథలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలను జువెనైల్ శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బేగ్ వారికి వివరించారు. హోంలో విలువిద్య శిక్షణను పరిశీలించి చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో హోమ్ సూపరింటెండెంట్లు నాగేశ్వర్‌రావు, నవీన్‌కుమార్, అఫ్జల్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే చర్యలు

వనస్థలిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తే చర్యలు తప్పవని సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్) అధికారి పి.రమేష్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ నాగార్జునకాలనీలోని భవిష్య మోడల్ స్కూల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు సీఆర్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఆర్పీ అధికారి రమేష్ తన సిబ్బందితో కలిసి భవిష్య పాఠశాలపై దాడి చేసి స్టడీ మెటీరియల్, పాఠ్య పుస్తకాలను భద్రపర్చిన గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ యోగేష్ యాదవ్, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సాయికుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: జడ్జి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

వనస్థలిపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే పథకాల అవగాహన కార్యక్రమానికి జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకుని తమలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసి తమ ప్రతిభను చాటాలన్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీసీ నోడల్ అధికారి రమేష్, సరూర్‌నగర్ తహసీల్దార్ వేణు, శ్యామల, డాక్టర్లు సుష్మిత, జయశ్రీ, రమ్య పాల్గొన్నారు.

ముగిసిన మహిళల టీ20 క్రికెట్ టోర్నీ


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న పారిజాత, తీగల

సరూర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన మహిళల టీ20 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శుక్రవారం టీకేఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా పారిజాత, తీగల మాట్లాడుతూ క్రీడారంగంలోనూ మహిళలకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్నదని, పురుషులతో సమానంగా అన్ని క్రీడల్లోనూ పాల్గొని సత్తా చాటాలని అన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బైరామల్‌గూడలో బాలుడి అదృశ్యం


జగదీష్

కొత్తపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పరిధిలోని బైరామల్‌గూడలో ఇంటి నుండి వెళ్లిపోయిన బాలుడు తిరిగి రాలేదు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన పల్లపు దేవరాజ్, రజిత దంపతులు కుమారుడు జగదీష్(16)తో కలిసి బైరామల్‌గూడ సాయినగర్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 27న రాత్రి 11.30కు వారందరు భోజనంచేసి నిద్రపోయారు. శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి జగదీష్ కనిపించలేదు. దేవరాజ్ వాడే సెల్‌ఫోన్, ఇంట్లో ఉన్న రూ.2వేలు కూడా కనిపించలేదు. అతడి ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించక జగదీష్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786